క్లుప్తంగా

పారిశుధ్య కార్మికుల సేవలు భేష్



పారిశుధ్య కార్మికులకు దుస్తులు అందిస్తున్న మేయర్ గొలగాని హరివెంకటకుమారి

ఆరిలోవ: గత నెలలో తుపాను ధాటికి ముంపునకు గురైన విజయవాడలో సేవలందించిన విశాఖ పారిశుధ్య కార్మికులు సేవలు ఎనలేనవని మేయర్ గొలగాని హరివెంకటకుమారి కొనియాడారు. విజయవాడ ముంపు ప్రాంతాల్లో విజయవంతంగా 15 రోజుల పాటు సేవలందించి తిరిగి విశాఖ చేరుకున్న జీవీఎంసీ పారిశుధ్య కార్మికులను ఆమె ప్రశంసించారు. ఆరిలోవ ప్రాంతం వార్డుల నుంచి వెళ్లిన పారిశుధ్య కార్మికులను సోమవారం పెదగదిలిలోని మేయర్ క్యాంప్ కార్యాలయంలో ఆమె సత్కరించి, దుస్తులు పంపిణీ చేశారు. మహిళా కార్మికులకు చీరలు, పురుష కార్మికులకు ప్యాంట్, షర్టులు అందించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ సేవలను ప్రోత్సహించడానికి కార్మికులను సత్కరించినట్లు తెలిపారు. కష్టకాలంలో ఆపదలను ఎదుర్కోవాడానికి అందరూ ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో 11వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ నమ్మి బంగారురాజు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల ప్రారంభం



పోటీలు ప్రారంభిస్తున్న నిర్వాహకులు

విశాఖ విద్య: యాదవ సంక్షేమ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఏయూ క్రీడా మైదానంలో సోమవారం క్రికెట్ పోటీలు ఆరంభమయ్యాయి. సంఘం జిల్లా అధ్యక్షుడు అక్కరమాని వెంకటరావు వీటిని ప్రారంభించారు. ఈ నెల 14 వరకు జరుగనున్న ఈ పోటీల్లో జిల్లా వ్యాప్తంగా వివిధ మండలాల నుంచి 24 టీమ్‌లు పాల్గొంటున్నాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సంఘ నాయకులు వెంకటరమణ, కనకరాజు, వేణుగోపాల్, రవికుమార్, సుభాస్ చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి వితరణ



వృద్ధులకు దుస్తులు అందజేస్తున్న సత్యసాయి విద్యావిహార్ విద్యార్థులు

ఎంవీపీకాలనీ: స్థానిక శ్రీ సత్యసాయి విద్యావిహార్ విద్యార్థుల ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు కొనసాగాయి. సత్యసాయిబాబా 99వ జయంతిని పురస్కరించుకొని సోమవారం 10వ తరగతి విద్యార్థులు ఎంవీపీ కాలనీలోని అమ్మ ఓల్డేజ్ హోమ్‌కు బియ్యం, పప్పు దినుసులు, నూనెలతో కూడిన పలు రకాల వంట సామగ్రిని వితరణ చేశారు. ఆశ్రమంలోని వృద్ధులకు చీరలు, దుప్పట్లు, టవళ్లతో కూడిన కిట్లు, పలు రకాల పండ్లు అందించార. 7వ తరగతికి చెందిన విద్యార్థులు ఎంవీపీ కాలనీ శివాలయం ఎదుట ఉన్న నిరాశ్రయులకు బెడ్‌షీట్లు, చీరలు, గొడుగులు, పండ్లు అందజేశారు. విద్యార్థులు స్వయంగా సేకరించిన నిధులతో వీటిని సిద్ధం చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో సత్యసాయి విద్యావిహార్ ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు భోజన సదుపాయం ప్రశంసనీయం

బీచ్‌రోడ్డు: సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా నగరంలోని శాంతి ఆశ్రమం స్కూల్, సేవా సదన్ స్కూల్, ఏవీన్ స్కూల్ విద్యార్థులకు ఏడాది పాటు భోజన సదుపాయం కల్పించేందుకు ముందుకొచ్చిన విశాఖ పోర్ట్ అథారిటీని టచ్ స్టోన్ చారిటీస్ సభ్యుడు సద్గోస్వామి అభినందించారు. శాంతి ఆశ్రమ పాఠశాలను సోమవారం ఆయన సందర్శించి విద్యార్థులకు భోజనం వడ్డించారు. మూడో పాఠశాల్లోని 600 మంది విద్యార్థులకు ఏడాది పాటు భోజన పంపిణీ చేసేందుకు సహాయం చేయడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

రైతుబజార్ ప్రారంభమెప్పుడో..?

- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తోటగరువు వద్ద నిర్మాణం
- ప్రారంభానికి ముందుకు రాని కూటమి ప్రభుత్వం
- అందుబాటులో బజార్ లేకపోవడంతో ఇబ్బంది పడుతున్న ఆరిలోవ ప్రజలు
- మందుబాబులకు అడ్డాగా ప్రాంగణం



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆరిలోవ తోటగరువు వద్ద నిర్మించిన రైతుబజార్



మరుగుదొడ్ల చుట్టూ పిచ్చి మొక్కలు



రైతుబజార్ స్టాళ్లలో పిచ్చి మొక్కలు

ఆరిలోవ: తూర్పు నియోజకవర్గంలో పలు చోట్ల అభివృద్ధి పనులు పడకేశాయి. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్న సమయంలో ప్రజాపయోగం కోసం చేపట్టిన పనులన్నీ మూలకు చేరాయి. ఆరిలోవ ప్రాంతంలో ఎన్నో ఏళ్లగా రైతుబజార్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుకున్నారు. గత ప్రభుత్వంలో ఇక్కడ రైతుబజార్ నిర్మించినా.. ఎప్పుడు వినియోగంలోకి వస్తుందోనని స్థానికులు ఎదురు చూస్తున్నారు. కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలు అధికారం చేపట్టి ఇదుగో అదుగో అంటూ ఆరిలోవ ప్రజలను మభ్యపెట్టాయి. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరిలోవ ప్రజలకు రైతుబజార్ అందుబాటులోకి తీసుకురావడానికి సన్నాహాలు చేసింది. ఇందులో భాగంగా జీవీఎంసీ మేయర్ గొలగాని హరివెంకటకుమారి దీని కోసం కృషి చేశారు. దీంతో జిల్లా మార్కెటింగ్ శాఖ ముందుకొచ్చింది. తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పక్కన బీఆర్‌టీఎస్ రహదారిని ఆనుకొని రెవెన్యూకు చెందిన సుమారు అరెకరానికి పైగా స్థలంలో 2023లో రైతుబజార్ నిర్మాణం చేపట్టింది. దీని కోసం మార్కెటింగ్ శాఖ సుమారు రూ.80 లక్షల నిధులు మంజూరు చేసింది. ఇక్కడ నిర్మాణ పనులు దాదాపు 2024 మార్చి నాటికి పూర్తయ్యాయి. అప్పటికి ఇంకా ప్లాట్‌ఫారం నిర్మించాల్సి ఉంది. ఇంతలో సాధారణ ఎన్నికలు వచ్చాయి. అనంతరం ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఈ రైతుబజార్ విషయాన్ని పక్కన పెట్టేసింది.

కావాలనే తాత్సారం..!

వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు చేపట్టిన నిర్మాణం కావడంతో ప్రజలకు ఉపయోగపడిందైనప్పటికీ దాన్ని వినియోగంలోకి తీసుకురాకుండా ఎమ్మెల్యే వెలగపూడి అడ్డుకుంటున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇక్కడ రైతులు, డ్వాక్రా మహిళలు కూరగాయలు, ఆకుకూరలు, పళ్లు విక్రయించడానికి 38 షాపులు, వ్యాపారుల కోసం 5 కిరాణ షాపులతో పాటు ఈవో కార్యాలయం, స్టోర్ రూం, వాచ్‌మన్ గది, పురుషులు, మహిళలకు వేర్వేరుగా మరుగుదొడ్లు, రైతులు, వినియోగదారులకు తాగు నీటిని అందించే ఆర్‌వో ప్లాంట్ కోసం ప్రత్యేక గది నిర్మించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటికి దీని నిర్మాణం పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌కు కొంత నిధులు ఇవ్వాల్సి ఉంది. ఆ డబ్బులను ఇంకా ఇవ్వకుండా తాత్సారం చేస్తున్నారు. కాంట్రాక్టర్‌కు బ్యాలెన్స్ డబ్బులు ఇవ్వకపోవడంతో ఆ నిర్మాణాన్ని అధికారులకు అప్పగించలేదని తెలిసింది. దీంతో రైతుబజార్ ప్రారంభం మూలకు చేరిపోయింది. దీన్ని ఎప్పుడు ప్రారంభిస్తారో అంటూ స్థానికులు ఎదురు చూస్తున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు నిలయం



బజార్ ప్రాంగణంలో మద్యం బాటిళ్లు

తోటగరువులో రైతుబజార్ నిర్మించి వినియోగంలోకి తీసుకురాకుండా వదిలేయడంతో దీని ఆవరణంతా పిచ్చి మొక్కలతో నిండిపోయింది. రైతులు కూరగాయాలు విక్రయించే స్టాళ్లలో సైతం పిచ్చి మొక్కలు మొలిచాయి. ఇక్కడ వినియోగదారులు, రైతుల కోసం నిర్మించిన మరుగుదొడ్లకు వెళ్లే దారి లేకుండా చుట్టు దట్టమైన పిచ్చి మొక్కలు అల్లుకున్నాయి. దీంతో అటువైపు ఎవ్వరూ వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఇదే అదునుగా కొందరు దీన్ని అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మార్చుకున్నారు. బజారు ప్రాంగణాన్ని మద్యం, గంజాయి బాబులు విచ్చలవిడిగా వినియోగించుకుంటున్నారు. ఇక్కడ స్టాళ్లు, వాటి చుట్టూ తుప్పలు ఉండటంతో వారి పని నిరాటంకంగా చేసుకుపోతున్నారు. పిచ్చి మొక్కల మధ్యలో వందల కొలది ఖాళీ మద్యం బాటిళ్లతో రైతుబజార్ ఆవరణ నిండిపోయింది. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి ప్రజా ప్రయోజనార్థం రైతుబజార్‌ను తక్షణం వినియోగంలోకి తీసుకురావాలని ఆరిలోవ వాసులు కోరుతున్నారు.

యువతకు ఉన్నత విద్యే ఎన్ఈపీ లక్ష్యం



ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ శశిభూషణరావు, అతిథులు

విశాఖ విద్య: దేశ యువతను భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మలచడమే నూతన విద్యా విధానం(ఎన్ఈపీ) లక్ష్యమని ఆంధ్రా యూనివర్సిటీ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు అన్నారు. ఏయూ విద్యా విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల జాతీయ సదస్సు సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా దేశ తొలి విద్యా శాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూల మాలలు వేసి అంజలి ఘటించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ ఎక్కువ శాతం మంది యువత ఉన్నత విద్యలో ప్రవేశించేలా చేయడమే నూతన విద్యా విధానం లక్ష్యమని తెలిపారు. బట్టీ పట్టే విధానం నుంచి విద్యార్థులను స్వయంగా నేర్చుకునేలా ప్రోత్సహిస్తారన్నారు. ఉన్నత విద్యలో మల్టీ డిసిప్లీనరీ విధానాన్ని ప్రోత్సహిస్తున్నారని, డిజిలాకర్, అకాడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్(ఏబీసీ) వంటివి విద్యార్థులకు ఎంతో సౌలభ్యాన్ని అందిస్తున్నాయని చెప్పారు. విశిష్ట అతిథి కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద మాట్లాడుతూ సమాజాభివృద్ధికి, సమాజ నిర్మాణానికి ఉపాధ్యాయులే కీలకమన్నారు. దేశ నిర్మాణంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. శారీరక, మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యమివ్వాలని సూచించారు. మను కేంద్రీయ విశ్వవిద్యాలయం శాటిలైట్ క్యాంపస్(బిహార్) విద్యా విభాగం ఆచార్యుడు పి.ఆడం పాల్ పాటేటి మాట్లాడుతూ కోవిడ్ అనంతరం బోధన అభ్యసన విధానాల్లో ఎంతో మార్పు వచ్చిందన్నారు. సదస్సు సంచాలకుడు, విద్యా విభాగాధిపతి డాక్టర్ టి.షారోన్‌రాజు మాట్లాడుతూ సదస్సుకు 2020 పరిశోధన పత్రాలు వచ్చాయని, వీటిని ప్రత్యేక సంచికగా తీసుకొస్తామని తెలిపారు. దేశంలోని 10 రాష్ట్రాలు, అమెరికా, ఆఫ్రికా దేశాల నుంచి సదస్సులో ప్రతినిధులు పాల్గొంటున్నారన్నారు. ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ ఆచార్య డి.నాగరాజా కుమారి తదితరులు ప్రసంగించారు. సదస్సు ప్రత్యేక సంచికను అతిథులతో కలిసి వీసీ శశిభూషణరావు ఆవిష్కరించారు. అనంతరం అతిథులను సత్కరించారు.

విస్తృతంగా సేవా కార్యక్రమాలు



రామ్‌నగర్ హైస్కూల్ విద్యార్థులతో రౌండ్ టేబుల్ ఇండియా సభ్యులు

బీచ్‌రోడ్డు: సీఎస్సార్‌లో భాగంగా రౌండ్ టేబుల్ ఇండియా సంస్థ కార్పొరేట్ కంపెనీలతో కలిసి విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఏరియా 9 చైర్మన్ మక్సూద్ అహ్మద్ తెలిపారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా 'విద్య ద్వారా స్వేచ్ఛ' అనే నినాదంతో సోమవారం రామ్‌నగర్ జీవీఎంసీ హైస్కూల్ విద్యార్థులను మధురవాడ సినీ పోలీస్ థియేటర్స్‌కు తీసుకెళ్లి సినిమా చూపించారు. ఈ సందర్భంగా మక్సూద్ అహ్మద్ మాట్లాడుతూ పరిశుభ్రమైన వాతావరణంలో విద్యార్థులు సౌకర్యవంతమైన విద్యనభ్యసించేందుకు రౌండ్ టేబుల్ సంస్థ సహకరిస్తుందన్నారు. సుమారు 600 మంది విద్యార్థులను సినీ పోలీస్ థియేటర్స్‌కు తీసుకెళ్లినట్లు చెప్పారు. విద్యార్థులను తరలించేందుకు గ్రీన్‌డేల్ స్కూల్, ప్రెసిడెన్షియల్ స్కూల్ యాజమాన్యాలు బస్సులను పంపి సహకరించినట్లు అహ్మద్ తెలిపారు. కార్యక్రమంలో రౌండ్ టేబుల్ ఇండియా జాతీయ అధ్యక్షుడు చైతన్య దేవ్‌సింగ్, సినీ పోలీస్ ఈవెంట్ కన్వీనర్ నీలేష్ జైన్, ఏరియా ఆర్‌టీఐ వీక్ కన్వీనర్ దినేష్ యలమర్తి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం



విద్యా దినోత్సవంలో పాల్గొన్న కృష్ణా డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు

మద్దిలపాలెం: దేశ తొలి విద్యా శాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా సోమవారం డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ విద్యా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. దేశ భవిష్యత్తును రూపొందించడంలో ఆజాద్ సేవలు ఎనలేనివని ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు కొనియాడారు. అధ్యాపకులు సి.వి.ఎస్.రవీంద్రనాథ్, జి.వి.ప్రతాప్ ఆజాద్ దేశానికి చేసిన విద్యా సేవను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, ఎన్ఎస్ఎస్ అధికారులు పోల ఉమామహేశ్వరరావు, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ కె.రవిబాబు, అకడమిక్ అడ్వైజర్ డి.శ్రావణ్ కుమార్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగ్గురు విద్యార్థులకు సత్కారం

యూనివర్సిటీ పీజీ స్థాయిలో ఉత్తమ ప్రతిభ చూపి మొదటి ర్యాంకు సాధించిన జువాలజీ విభాగం నుంచి బోరా కీర్తన, ఇంగ్లిష్‌విభాగం నుంచి ఎం.లావణ్య, బయోటెక్నాలజీ విభాగం నుంచి జె.పుష్పలతలను ప్రిన్సిపాల్ విజయబాబు అభినందించి సత్కరించారు.

న్యాయ శాస్త్రంలో నిష్ణాతులు కావాలి



మాట్లాడుతున్న ఏయూ లా కాలేజీ ప్రిన్సిపాల్ సీతా మాణిక్యం



ఓరియంటేషన్ తరగతులకు హాజరైన లా విద్యార్థులు

విశాఖ విద్య: న్యాయ శాస్త్రంలో నిష్ణాతులు కావడమే లక్ష్యంగా విద్యార్థులు చదువులు సాగించాలని ఆంధ్రా యూనివర్సిటీ లా కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.సీతా మాణిక్యం అన్నారు. ఏయూ లా కాలేజీలో ఈ ఏడాది నూతనంగా ప్రవేశాలు పొందిన విద్యార్థులకు సోమవారం ఓరియంటేషన్ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏయూ లా కాలేజీ ఎందరో మహానుభావులను సమాజానికి అందించిందన్నారు. సమాజానికి నిజాయితీ, ధైర్యం కలిగిన న్యాయవాదుల అవసరం ఎంతగానో ఉందని పేర్కొన్నారు. అటువంటి న్యాయవాదులను తయారు చేయడంలో ఆంధ్రా యూనివర్సిటీ లా కళాశాల పాత్ర కీలకమన్నారు. ఆంధ్ర లా కాలేజ్‌లో చదువు కోవడం ఓ గొప్ప అనుభూతిగా జీవితంలో మిగిలిపోవాలన్నారు. సమయాన్ని సద్వినియోగం చేసుకొని న్యాయ శాస్త్రంలో పరిపూర్ణమైన విజ్ఞానాన్ని సముపార్జించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ కేశవరావు, గీతం లా కాలేజీ మాజీ డీన్ డాక్టర్ ఆర్.అనితరావ్, ఏ-హబ్ సీఈవో ఈసారపు రవి, ప్రొఫెసర్ రాజ్యలక్ష్మి, ప్రొఫెసర్ జి.రాఘవయ్య , ప్రొఫెసర్ ఎస్.సుమిత్ర, ప్రొఫెసర్ ఎస్.బి.చంద్రకళ, టీ నాగభూషణం, డాక్టర్ ఎల్.వి.కె.ప్రసాద్, డాక్టర్ కె.పల్లవి, విద్యార్థులు పాల్గొన్నారు.

పాండురంగ స్వామి కల్యాణ వైభోగం



కల్యాణం జరిపిస్తున్న పురోహితులు

ఏయూక్యాంపస్: పాండురంగ పురంలోని రుక్మిణి సమేత ప్రసన్న పాండురంగ స్వామి ఆలయ వార్షికోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, అంకురార్పణ, మండపారాధన నిర్వహించారు. అనంతరం అఖండ పంచామృతాభిషేకం జరిపారు. రుక్మిణి సమేత ప్రసన్న పాండురంగ స్వామి కల్యాణం వేదపండితుల మంత్రోచ్చారణలో వైభవంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు ఆలయ వార్షికోత్సవాలు జరుగుతాయి. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మంగళహారతి ఇచ్చారు. కార్తీక శుద్ధ ఏకాదశి పర్వదినం సందర్భంగా సుందర్శన గాయత్రి హోమం, అఖండ పంచామృతాభిషేకం, అష్టోత్తర కార్యక్రమం జరిపారు. అనంతరం భక్తులకు ప్రసాదం అందించారు. పాండురంగస్వామి ఆలయ సముదాయంలోని శివాలయాన్ని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఉదయం, రాత్రి ప్రత్యేక అభిషేకాలు తమ గోత్ర నామాలతో జరిపించుకున్నారు.

నేటి కార్యక్రమాలు

క్షీరాబ్ది ద్వాదశిని పురస్కరించుకుని మంగళవారం ఉదయం లక్ష తులసి అర్చన, ప్రసాద వితరణ, సాయంత్రం నుంచి స్వామి వారి తిరువీధి ఊరేగింపు సేవ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆలయ మేనేజర్ అడపా దేవుళ్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో శివుడికి పూజలు



ఆరిలోవ శివాజీనగర్-2 శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



సుందరేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న భక్తులు



డ్రైవర్స్ కాలనీ శివాలయంలో ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న మహిళలు



సత్యనారాయణ స్వామి వ్రతం ఆచరిస్తున్న భక్తులు

ఆరిలోవ: కార్తీక మాసం రెండో సోమవారం సందర్భంగా శివాలయాలు భక్తులతో నిండిపోయాయి. వేకువజాము నుంచి ఆలయాలకు చేరుకుని శివుడికి భక్తిశ్రద్ధలతో పూజలు, అభిషేకాలు చేశారు. ఆరిలోవలోని శివాజీనగర్-2, ఆపరేషన్ కాలనీ, నెహ్రూనగర్, పెదగదిలి, డ్రైవర్స్ కాలనీ, కైలాసనగర్, రవీంద్రనగర్, ఆదర్శనగర్, హనుమంతవాక, విశాలాక్షినగర్ ప్రాంతాల్లోని శివాలయాల్లో స్వామిని భక్తులకు దర్శించుకున్నారు. ఆలయాల ముందు ధ్వజస్తంభాల వద్ద కార్తీక దీపాలు వెలిగించి భక్తిశ్రద్ధలతో కొలిశారు. దీంతో ఆయా ప్రాంతాల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

ఆలయాలకు ఏకాదశి శోభ

ఏయూక్యాంపస్: కార్తీక మాసం రెండో సోమవారం, ఏకాదశి పర్వదినం కలసి రావడంతో భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చినవాల్తేరు కనకమ్మ గుడిలోని దుర్గామల్లికార్జున స్వామి ఆలయం, ఏయూ అవుట్ గేట్ వద్దనున్న లలితా పీఠంలోని సుందరేశ్వర స్వామి, కాళీమాత ఆలయంలోని రసలింగేశ్వరునికి విశేష అభిషేకాలు, అర్చనలు చేశారు. అవుట్ గేట్ డౌన్‌లోని రామాలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు జరిపించారు. సాయంత్రం వేళ మహిళలు ఆలయాల ధ్వజస్తంభాలు, రావిచెట్టు వద్ద దీపాలు వెలిగించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.



ప్రత్యేక అలంకరణలో లలితా దేవి

అంధుల పాఠశాలలో వైద్య శిబిరం



వైద్య సేవలను పర్యవేక్షిస్తున్న సివిల్ జడ్జి వెంకట శేషమ్మ

ఎంవీపీకాలనీ: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఎంవీపీ కాలనీ సెక్టార్-9లోని హెలెన్ కెల్లర్ అంధుల పాఠశాలలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథి జిల్లా సివిల్ జడ్జి, లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి ఎం.వెంకట శేషమ్మ వైద్య శిబిరాన్ని పర్యవేక్షించారు. నేత్ర వైద్య నిపుణుడు డాక్టర్ తేజప్రవీణ్ ఆధ్వర్యంలో బృందం విద్యార్థులకు వివిధ రకాల కంటి వైద్య పరీక్షలు నిర్వహించింది. విద్యార్థుల మానసిక, ఆరోగ్య పరిస్థితులను వైద్యులు పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు కావాల్సిన ఔషధాలు, చుక్కల మందులను అందజేశారు. కంటి ఆరోగ్యం మెరుగుపరచుకోవడంతోపాటు మానసిక సమస్యలను అధిగ మించేందుకు అవసరమైన సూచనలిచ్చారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ ఇ.లక్ష్మీనారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

శునకాల నేస్తం



తోటివారినే పట్టించుకోని ఈ రోజుల్లో ఒక వ్యక్తి మూగజీవాల కడుపు నింపుతున్నాడు. ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజ్ గ్రౌండ్ వద్ద ఉన్న శునకాలకు ప్రతి రోజు ఏదో ఒక ఆహారం అందిస్తున్నాడు. రోజూ సాయంత్రం 5 గంటలు కాగానే ఆ శునకాలన్నీ అతడి రాక కోసం వేచిచూస్తూ ఉండటం అక్కడున్న వారిని ఆశ్చర్యపరుస్తోంది.

– ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

డిసెంబర్‌లో ఐఐఏఎం 'పినాకిల్-2024' మీట్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న రవీంద్ర తదితరులు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్-7లోని ఇంటీగ్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్(ఐఐఏఎం) ఆధ్వర్యంలో నేషనల్ మేనేజ్‌మెంట్ మీట్‌ను నిర్వహించనున్నారు. పినాకిల్-2024 పేరిట డిసెంబర్ 20, 21 తేదీల్లో జరగనున్న కార్యక్రమ పోస్టర్‌ను సోమవరం ఐఐఏఎంలో ఇన్‌స్టిట్యూట్ డీన్, డైరెక్టర్ డాక్టర్ సుంకరి రవీంద్ర కళాశాల ఉన్నతాధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ మేనేజ్‌మెంట్ విద్యార్థులు నైపుణ్యాలను ప్రదర్శించడంతోపాటు ఆలోచనలు, ఆవిష్కరణలను తోటి విద్యార్థులతో పంచుకోవడానికి ఈ మీట్ మంచి వేదికగా నిలుస్తుందన్నారు. జాతీయ స్థాయిలో మేనేజ్‌మెంట్ విద్యార్థుల మధ్య మంచి నెట్‌వర్కింగ్‌ను క్రియేట్ చేసే వేదిక కానుందని చెప్పారు. మేనేజ్‌మెంట్ విద్యార్థులంతా ఈ కార్యక్రమంలో భాగస్వాములుగా నిలవాలని ఆకాంక్షించారు. ఐఐఏఎం జాయింట్ డైరెక్టర్ పీఎం బాలాజీ, పినాకిల్-2024 కన్వీనర్ డాక్టర్ ఉమాసుందరి తదితరులు పాల్గొన్నారు.

పిల్లల్లో నైపుణ్యాల పెంపుతో ఉజ్వల భవిత



స్టడీ హబ్‌లో పాల్గొన్న ఉపాధ్యాయుల బృందం తదితరులు

మద్దిలపాలెం: కేజీ స్థాయి పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం 21వ శతాబ్దపు నైపుణ్యాలను పెంపొందించడానికి స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్‌లో అవలంబిస్తున్న ఎడ్యూ ఈజీ కాన్సెప్ట్ ఎంతో దోహదపడుతుందని ఆ స్కూల్ డైరెక్టర్ మళ్ల రామునాయుడు, ప్రిన్సిపాల్ వాణిశ్రీ పేర్కొన్నారు. ఈ నెల 7 నుంచి 11 వరకు మద్దిలపాలెం కృష్ణా కాలేజీ రోడ్డులోని స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్‌లో నిర్వహించిన స్టడీ హబ్ సోమవారంతో విజయవంతంగా ముగిసింది. తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచి 9 మంది స్కూల్ హెడ్‌లు, 80 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్‌లో వినూత్న బోధనలను వారంతా వీక్షించి, ఎడ్యూ ఈజీ కాన్సెప్ట్‌ను అభినందించారు. ప్రీ కేజీ పిల్లలు 500 ప్రశ్నలకు సమాధానాలు చెప్పి అందరినీ మెప్పించారు. డైరెక్టర్ రామునాయుడు కుమార్తె మళ్ల శర్వాణి తరగతి గదిలో విద్యార్థులతో వినూత్నంగా ఎలా వ్యవహరించాలో శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.మధుసూదన్, ప్రధాన కార్యదర్శి రమేష్ రావ్, కమిటీ సలహాదారు గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గౌరీపరమేశ్వరులకు సారె సమర్పణ



సారె సమర్పిస్తున్న ఇసుకతోట వాసులు

మద్దిలపాలెం: పాత వెంకోజీపాలెం సీతారామ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గౌరీపరమేశ్వరుల నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఇసుకతోటకు చెందిన శ్రీ సీతారామ సేవా మండలి సంఘం సారె సమర్పించింది. వివిధ రకాల మిఠాయిలు, పొంగడాలు, బూరెలు, అరిసెలు వంటి పిండివంటలతోపాటు పసుపు, కుంకుమల సారెను ఇసుకతోట నుంచి ఊరేగించుకుంటూ మహిళలు, గ్రామ పెద్దలు తీసుకొచ్చి గౌరీపరమేశ్వరులకు సమర్పించారు. వారికి ఆలయ అర్చకుడు రంపా మురళి అభిషేకం నిర్వహించి, తీర్థప్రసాదాలు అందజేశారు. సారె తీసుకొచ్చిన ఇసుకతోట ప్రాంత వాసులను గ్రామ పెద్దలు సత్కరించారు.

అనారోగ్య సిరలపై అవగాహన

బీచ్‌రోడ్డు: వెరికోస్ వెయిన్‌లకు(అనారోగ్య సిరలు) సంబంధించిన చికిత్సపై అవగాహనతోనే పురోగతి సాధించవచ్చని ఇంటర్వెన్షనల్ రేడియాలజిస్ట్ డాక్టర్ ప్రసాద్ నల్లాల అన్నారు. నగరంలోని ఒక హోటల్‌లో సోమవారం నిర్వహించిన వెరికోస్ వెయిన్లపై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనారోగ్య సిరలు చికిత్సకు లేజర్ థెరపీ ప్రధాన ఎంపికైనప్పటికీ ప్రత్యామ్నాయ చికిత్సలు అనేకం అందుబాటులోకి వచ్చాయన్నారు. అందులో రేడియో ఫ్రీక్వెన్సీ అబ్లేషన్(ఆర్ఎఫ్ఏ) మంచి ఫలితాలను ఇస్తుందని చెప్పారు. అనారోగ్య సిరలులో ఇంటర్వెన్షనల్ రేడియాలజిస్ట్‌ల పాత్రపై రోగులు అవగాహన కలిగి ఉన్నప్పుడు రోగ నిర్ధారణ సులభమవుతుందని డాక్టర్ ప్రసాద్ పేర్కొన్నారు.